విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 | సంచిక :138 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 5 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool






## ఏపీ ప్రజల అన్ని ఆశలు నెరవేర్చడం చంద్రబాబు ద్వారానే సాధ్యం

- బుర్రిపాలెంలో శివరాజ్ సింగ్ చౌహాన్
- తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో కార్యక్రమం
- 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన
- హాజరైన కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, సీఎం చంద్రబాబు
- సీఎం చంద్రబాబు కోరిక మేరకు మరిన్ని ఇళ్లు ఇస్తామని శివరాజ్ సింగ్ హామీ
- జగన్ పాలనలో ఏపీ నాశనమైందని, పేదల ఇళ్లను అడ్డుకున్నారని విమర్శ
- చంద్రబాబు విజన్‌తో ఏపీ దేశంలోనే నంబర్ వన్ అవుతుందని ఉద్ఘాటన

# 3డీ ప్రింటింగ్‌తో పేదల ఇళ్లు



- చంద్రబాబు సర్కారు వినూత్న ముందడుగు
- రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్రమంత్రి హామీ
- బుర్రిపాలెంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టు
- 2029 నాటికి పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామన్న సీఎం చంద్రబాబు
- ఏపీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్ అన్న శివరాజ్‌సింగ్ చౌహాన్

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో వేగంగా, పటిష్టంగా, తక్కువ ఖర్చుతో ఇళ్లను నిర్మించే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో, ఏకంగా 9 లక్షల ఇళ్లను నిర్మించి పేదలకు పట్టాభిషేకం చేయాలని సంకల్పించింది. ఈ మహాయజ్ఞంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ గృహ నిర్మాణ యజ్ఞంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ. దేశంలోనే తొలిసారిగా భారీ ఎత్తున ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం బుర్రిపాలెంలో రూ.14 కోట్ల వ్యయంతో 177 ఇళ్లను పైలట్ ప్రాజెక్టుగా నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్‌లకు అధికారులు

వివరాలు 2లో..



## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

- కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్
- రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు





## శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు..

- శిలాతోరణం వరకు బారులు తీరిన క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల అధిక రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండి శిలాతోరణం వరకు చేరిన క్యూలైన్లు
- సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతుందని అంచనా
- శనివారం శ్రీవారిని 91,296 మంది దర్శించుకోగా, హుండీ ద్వారా రూ.5.06 కోట్ల ఆదాయం

# ఏపీలో 'తల్లికి వందనం'.. రెండో విడతకు రంగం సిద్ధం

- సుమారు 3.29 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.13,000 జమ
- ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం.. సీఎంవో అనుమతి కోసం నిరీక్షణ
- వచ్చే వారం లేదా రెండు వారాల్లో నిధులు విడుదలయ్యే అవకాశం





**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి తుది అనుమతి రావడమే మిగిలి ఉంది. సీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే నిధులను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి

వివరాలు 2లో..



## 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్) పథకానికి శ్రీకారం

- కడప జిల్లాలో చంద్రబాబు, పవన్ పర్యటన
- రూ.30,156 కోట్ల వ్యయంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా
- రాష్ట్రవ్యాప్తంగా 27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యం
- ప్రొద్దుటూరులో పథకం ప్రారంభించి, బహిరంగ సభలో ప్రసంగించనున్న నేతలు

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్) పథకానికి సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రేపు (అక్టోబరు 5) కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో పర్యటించనున్నారు. వీరిద్దరూ కలిసి ఈ భారీ తాగునీటి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి,

వివరాలు 2లో..



## ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

- ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా డ్రోన్ల దాడి
- సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్ ప్లాంట్ దాదాపు ధ్వంసం
- దాడిలో ఒకరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- దాదాపు రూ.400 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా

# ఏపీ ప్రజల అన్ని ఆశలు నెరవేర్చడం

# చంద్రబాబు ద్వారానే సాధ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్త ఆకాంక్షలు నెరవేర్చగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. చంద్రబాబు ఒక డైనమిక్, డెడికేటెడ్, డెసిసివ్ నాయకుడని, ఆయన విజన్‌కు తాను సెల్యూట్ చేస్తున్నానని కొనియాడారు. తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో జరిగిన 3 లక్షల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అవతరించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల కలలను సాకారం చేయడానికి చంద్రబాబు నాయకత్వం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.

**టెక్నాలజీతో రాష్ట్రాభివృద్ధికి బాటలు**

భవిష్యత్తులో దేశానికి అతిపెద్ద శక్తి టెక్నాలజీయేనని చంద్రబాబు ఎప్పుడో గుర్తించారని శివరాజ్ సింగ్ గుర్తుచేశారు. "ఆయన దూరదృష్టితోనే ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రాన్ని గ్లోబల్ ఐటీ హబ్‌గా ప్రపంచానికి పరిచయం చేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో ఏపీలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. అమరావతి అభివృద్ధిపై ఆయన విజన్ చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆయన నిబద్ధత, కఠోర శ్రమతో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఐకాన్‌గా నిలుస్తుంది" అని చౌహాన్ పేర్కొన్నారు.

**జగన్ పాలనలో సర్వనాశనం**

గత ఐదేళ్లలో జగన్ తన విధ్వంసకర వైఖరితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని చౌహాన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రధాని నరేంద్ర మోదీ పేదల ఇళ్ల కోసం నిధులు పంపితే, జగన్ ప్రభుత్వం తన వాటా ఇవ్వకుండా ఆ పథకాన్ని నీరుగార్చింది. పేదల సొంతింటి కలను చిదిమేసింది. కేంద్రం పంపిన నిధులను దారి మళ్లించి పాపం చేసింది. జగన్‌ను ఏపీ ప్రజలు ఎప్పటికీ క్షమించరు" అని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వం సరిగ్గా పనిచేసి ఉంటే, ఈపాటికే పేదలందరికీ ఇళ్లు ఉండేవని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్రాన్ని రాజధాని లేకుండా వదిలేస్తే, జగన్ మూడు రాజధానుల ఆటతో గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు.

**పేదలందరికీ పక్కా ఇళ్లు.. కేంద్రం భరోసా**

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పేదలందరికీ ఇళ్లు కట్టించాలని సంకల్పించారని శివరాజ్ సింగ్ తెలిపారు. "కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాష్ట్రానికి 76,000 ఇళ్లు మాత్రమే వస్తాయని అధికారులు చెప్పారు. కానీ చంద్రబాబు గారు అందరికీ ఇళ్లు కావాలని, ఇంకా ఎక్కువ కేటాయించాలని ప్రధాని మోదీని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు తొలి విడతగా 3 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఇవాళ బాబు గారు ఇవి కూడా చాలవు, మరో 6 లక్షల ఇళు కావాలని అడిగారు. తప్పకుండా ఇస్తాం. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక, మళ్లీ 3 లక్షలు, ఆ తర్వాత మరో 3 లక్షలు ఇచ్చి రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను ప్రధాని మోదీ ఆశీస్సులతో, చంద్రబాబు నాయకత్వంలో నెరవేరుస్తాం" అని హామీ ఇచ్చారు. బుర్రిపాలెంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్లు నిర్మించడం దేశానికే ఆదర్శమని, ఇది సమయాన్ని, ఖర్చును తగ్గిస్తుందని ప్రశంసించారు.

**మోదీ-బాబు నాయకత్వంలో 360 డిగ్రీల అభివృద్ధి**

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చేస్తున్నారని చౌహాన్ అన్నారు. "మోదీ, బాబు అంటే ఒకటి ం ఒకటి = రెండు కాదు.. ఒకటి ం ఒకటి = పదకొండు. వారితో పవన్ కల్యాణ్ కూడా తోడయ్యారు. ఈ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తారు. అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో చట్టం చేశాం. రాష్ట్రానికి రూ. 15,000 కోట్ల ఆర్థిక సహాయం అందించాం. జగన్ సర్కారు పక్కన పెట్టిన పోలవరం ప్రాజెక్టును 100 శాతం కేంద్ర నిధులతో పూర్తి చేస్తాం" అని స్పష్టం చేశారు.

**మహిళలు, రైతుల సంక్షేమానికి పెద్దపీట**

రాష్ట్రంలోని ఏ సోదరి పేదరికంలో ఉండకూడదనే లక్ష్యంతో 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 23 లక్షలుగా ఉన్న లఖ్‌పతి దీదీల సంఖ్యను 60 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే 'సరస్ మేళా'ను తొలిసారిగా ఢిల్లీ నుంచి బయటకు తీసుకొచ్చి, అక్టోబర్ 15న విజయవాడలో నిర్వహిస్తున్నామని ప్రకటించారు. ఇది మహిళల పాలిట కుంభమేళా అవుతుందన్నారు. రైతుల కోసం కేంద్రం ఇస్తున్న రూ. 6,000కు అదనంగా, చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ' కింద మరో రూ. 14,000 కలిపి మొత్తం రూ. 20,000 అందించి రైతులకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని భరోసా ఇచ్చారు. "చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఇక సర్వైవింగ్ స్టేట్ కాదు, షైనింగ్ స్టేట్‌గా మారింది. ఆస్పిరేషనల్ ఆంధ్ర, యాంబిషియస్ ఆంధ్ర, ఆసమ్ ఆంధ్రగా రూపుదిద్దుకుంటోంది. ప్రతి ఒక్కరి కలలను నెరవేర్చే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది" అని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన ప్రసంగాన్ని ముగించారు.

# ఐదేళ్ల సర్వీసులో నాలుగు అవార్డులు సాధించిన ఉద్యోగి




మనం చేసే పని చిన్నదా, పెద్దదా అనేది ముఖ్యం కాదు, ఎంత నిబద్ధతతో చేస్తున్నామనేదే ముఖ్యం. అంకితభావంతో పనిచేసేవారికి వెంటనే ఫలితం కనిపించకపోయినా, దీర్ఘకాలంలో మాత్రం తప్పక గుర్తింపు లభిస్తుంది. అంతేగాక వారు సాధించే విజయాలు, గౌరవం సమాజంలో, సంస్థలో చాలా గొప్పగా ఉంటాయి. కష్టపడి పనిచేసే గుణం ఎప్పుడూ వృథా పోదు. అది మనల్ని ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుంది. అలాగే బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడం ద్వారా అధికారుల్లో, సమాజంలో మంచి గౌరవం లభిస్తుంది. అందులోనూ ప్రభుత్వ విధుల్లో అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుంది. చేస్తున్నది చిన్న ఉద్యోగమైనా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే ఉన్నతస్థాయి పురస్కారాలు సైతం దక్కుతాయి. ఇందుకు పోలవరం జిల్లా వరరామచంద్రాపురం మండలంలోని వడ్డిగూడెం-1 అంగన్‌వాడీ కార్యకర్త పి.లక్ష్మీకుమారి నిదర్శంగా నిలుస్తున్నారు. విధుల్లో చేరిన ఐదేళ్లలోనే నాలుగు అవార్డులు అందుకున్నారు. వీటిలో ఒకటి జాతీయస్థాయి పురస్కారం కావడం విశేషం.

**అంకితభావంతో**

వడ్డిగూడెం పంచాయతీలోని ధర్మతాళ్లగూడెం గ్రామానికి చెందిన లక్ష్మీకుమారి అదే పంచాయతీలోని వడ్డిగూడెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో అయిదేళ్ల క్రితం కార్యకర్తగా విధుల్లో చేరారు. సమయపాలన, పరిశుభ్రతకు ఆమె ప్రాధాన్యం ఇస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని శుభ్రంగా ఉంచడంతో పాటు ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యా బోధన చేస్తున్నారు. లబ్ధిదారులకు పౌష్టికాహారం, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ అవి అందేలా చూస్తున్నారు.

**కిచెన్ గార్డెన్ నిర్వహణ**

కేంద్రం వద్ద ఉన్న కొద్దిపాటి స్థలంలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి అరటి తదితర పండ్ల మొక్కలు పెంచుతున్నారు. చేతికి వచ్చిన కాయలు, పండ్లను లబ్ధిదారులతో పాటు, గ్రామస్థులకు అందిస్తున్నారు.

**సాధించిన అవార్డులు :**

26 జనవరి 2025: చింతూరు ఐటీడీఏలో ఉత్తమసేవా పురస్కారం

26 జనవరి 2026: దిల్లీలో జాతీయస్థాయిలో ఉత్తమసేవా అవార్డు

ఈ ఏడాది మార్చి: మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో మహిళా రత్న అవార్డు

గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ అంగన్‌వాడీ అవార్డు

పనిని దైవంగా భావిస్తా : ' నేను పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో మొత్తం 58 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 22 మంది ప్రీస్కూల్ పిల్లలు. బాలింతలు, గర్భిణులు 16 మంది, ఇతరులు 20 మంది ఉన్నారు. వారికి మెరుగైన సేవలు అందించడం నా బాధ్యతగా భావిస్తున్నా. పనిని దైవంగా భావించి విధులు నిర్వహిస్తున్నా. గ్రామస్థులు సహకరిస్తున్నారు. అధికారులు ప్రోత్సహిస్తున్నారు' అని అంగన్‌వాడీ కార్యకర్త పి.లక్ష్మీకుమారి తెలిపారు.

# ఆర్టీసీలో 'కాంట్రాక్ట్' కండక్టర్లు!

# ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా వ్యవస్థలో సరికొత్త మార్పులు

ఏపీఎస్ఆర్టీసీలో కండక్టర్ల కొరతను అధిగమించేందుకు అధికారులు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు. తొలిసారిగా ప్రైవేటు వ్యక్తులను కండక్టర్లుగా తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నారు. పొరుగు సేవలు (ఔట్‌సోర్సింగ్), కాంట్రాక్ట్ లేదా ఆన్‌కాల్ విధానం ద్వారా అర్హులైన వ్యక్తులతో విధులు నిర్వర్తించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో సుమారు 3,600 మంది డ్రైవర్లు, 2,400 మంది కండక్టర్ల కొరత ఉంది. ప్రతి నెలా వయసు పైబడిన ఉద్యోగు లు పదవీ విరమణ పొందుతున్నారు. దానికి తగ్గట్లుగా కొత్త నియామకాలు మాత్రం జరగడం లేదు. కండక్టర్ల కొరత ఉండ టంతో అనేక డిపోల్లో బస్సు సర్వీసులను ఆకస్మికంగా రద్దు చే యాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రెగ్యు లర్ కండక్టర్లతోనే డబుల్ డ్యూటీలు వేయించి సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తున్నా, సమస్య మాత్రం పూర్తిగా తీరడం లేదు.




**డ్రైవర్లకు ఇప్పటికే ఆన్‌కాల్ విధానం**

డ్రైవర్ల కొరతను తీర్చేందుకు ఆర్టీసీ అధికారులు ఇప్పటికే ఆన్‌కాల్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల్లో ప్రతిరోజూ దాదాపు 1,800 మంది ఆన్‌కాల్ డ్రైవర్లతో బస్సులు నడిపిస్తున్నారు. రోజువారీ అవసరాల కోసం రెగ్యులర్ డ్రైవర్లు పోను, అదనంగా అవసరమైన వారిని బయట నుంచి తీసుకుంటున్నారు. వీరికి రోజుకు రూ.1,000 చొప్పున పారితోషికం చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఇదే తరహాలో కండక్టర్లను కూడా తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

**తెలంగాణ మోడల్ పరిశీలన**

కండక్టర్ల నియామకం కోసం తెలంగాణ ఆర్టీసీ అమలు చేస్తున్న విధానాన్ని ఏపీ అధికారులు లోతుగా అధ్యయనం చేస్తున్నారు. తెలంగాణలో ఏడాది కాలంగా కాంట్రాక్టర్ల ద్వారా పొరుగు సేవల కింద కండక్టర్లను తీసుకుంటున్నారు. ఈ విధానంలో ఒక్కో డిపో పరిధిలో కాంట్రాక్టర్ ఆర్టీసీకి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. డిపోకు రోజుకు ఎంతమంది కండక్టర్లు అవసరమో, అంతమందిని ఆ కాంట్రాక్టరే సమకూర్చాలి. డ్యూటీ సమయంలో టికెట్ ఛార్జీల వసూళ్లలో నగదు తేడా వచ్చినా, టికెట్ జారీ యంత్రం (టిమ్) పాడైనా, కాంట్రాక్టర్ చెల్లించిన డిపాజిట్ నగదు నుంచే రికవరీ చేస్తారు. ఈ కాంట్రాక్ట్ విధానాన్ని ఏపీఎస్ఆర్టీసీలో సైతం అమలు చేస్తే ఎలా ఉంటుందనే కోణంలో అధికారులు ముమ్మరంగా చర్చలు జరుపుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఇంకా ఏవైనా మెరుగైన విధానాలు ఉన్నాయా అని కూడా ఆరా తీస్తున్నారు. ఈ అంశంపై త్వరలోనే ఓ స్పష్టమైన నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ఆర్టీసీ వర్గాలు వెల్లడించాయి.

## 3డీ ప్రింటింగ్‌తో పేదల ఇళ్లు..

-మొదటిపేజీ తరువాయి

టెక్నాలజీ గురించి వివరించారు.

ఈ విధానంలో కేవలం 10 రోజుల్లోనే ఒక ఇంటి నిర్మాణం పూర్తి చేయవచ్చని, ఇది ఎంతో పటిష్టంగా ఉంటుందని తెలిపారు. ఈ ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, ఇది పేదలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో చేపడుతున్న ఈ 3డీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు.

**9 లక్షల ఇళ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేదలకు సొంతిల్లు వారి ఆత్మగౌరవాన్ని పెంచుతుందని, ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు మాత్రమే ఉండగా, తన విజ్ఞప్తి మేరకు కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోపే మరో 3 లక్షలు, వచ్చే ఏడాది ఇంకో 3 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని, మొత్తంగా 9 లక్షల ఇళ్లకు కేంద్రం సహకరిస్తోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో స్థలాలు ఇచ్చి పేదలను మోసం చేశారని విమర్శించారు.

**షైనింగ్ ఆంధ్రాగా ఏపీ: శివరాజ్‌సింగ్ చౌహాన్**

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఇక "షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్‌డ్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రా"గా మారబోతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న చంద్రబాబు సంకల్పం గొప్పదని ప్రశంసించారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు అందిస్తున్నారని, రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు సుఖంగా ఉండాలనే విధానంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్.. ఒక లబ్ధిదారురాలి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, వారికి నూతన వస్త్రాలు అందించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. వేదికపై లక్ష్మీ అనే మహిళకు ఇంటి పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. "నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

## ఏపీలో 'తల్లికి వందనం'.. రెండో విడతకు రంగం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు, గతంలో సాంకేతిక కారణాలు, ఇతర మార్పుల వల్ల డబ్బులు అందని వారికి కూడా ఈ విడతలో నిధులు అందించనున్నారు. అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ కూడా ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ ఫైల్ సీఎంవో వద్ద తుది ఆమోదం కోసం ఉంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అనుమతి లభించిన వెంటనే, ఒకటి రెండు వారాల్లో లేదా వచ్చే వారంలోనే నిధులు జమ అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయ్యిందా లేదా, ఈ-కేవైసీ పూర్తయిందా అనే వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వంటివి సరిగ్గా ఉంటే నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో జమ అవుతాయని వారు స్పష్టం చేశారు.

## 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్) పథకానికి శ్రీకారం

-మొదటిపేజీ తరువాయి



జాతికి అంకితం చేస్తారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం, సోమవారం ఉదయం 11:20 గంటలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన ప్రత్యేక శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై వారు ప్రజలకు వివరించే అవకాశం ఉంది. నేతల పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం సుమారు రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 27.36 లక్షల కొత్త గృహ కుళాయి కనెక్షన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ముఖ్యంగా, తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచివెళ్లే గ్రామీణ మహిళల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వంలో ఇది ఒక కీలకమైన గ్రామీణ సంక్షేమ కార్యక్రమంగా నిలవనుంది.

# సింహాచలం దేవస్థానం ఈఓ వెంకట్రావు ని సత్కరించిన వంశీకృష్ణ.



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 04:** మెరుగైన సేవలతో పాటు, పారిశుధ్య నిర్వహణలో విశిష్ట సేవలు అందించి రాష్ట్ర స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుని సింహాచలం దేవస్థానం సాధించిన నేపథ్యంలో దేవస్థానం ఈఓ వెంకట్రావు ని దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈఓ వెంకట్రావు కి శాలువా కప్పి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. దేవస్థానంలో పారిశుధ్య నిర్వహణతో పాటు ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో ఈఓ వెంకట్రావు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఇంజనీరింగ్ విభాగంతో సమన్వయం చేసుకుంటూ, పారిశుధ్యం, నిర్వహణ, ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ దేవస్థానాన్ని అనేక విధాలుగా మరింత మెరుగైన స్థాయికి తీర్చిదిద్దారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు అందుకోవడం దేవస్థానానికి, సిబ్బందికి గర్వకారణమని అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఈఓ వెంకట్రావు కి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చింతమనేని సమక్షంలో భారీగా టీడీపీ లోకి చేరికలు.







- దెందులూరులో వైసీపీ కి కోలుకోలేని దెబ్బ.
- మసీదుపాడులో వైసీపీ కంచుకోట బద్దలు.
- కూటమి ప్రభుత్వ అభివృద్ధి పాలనకు ఆకర్షితులై టీడీపీ తీర్థం పుచ్చుకున్న 25 కుటుంబాలు.
- పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన చింతమనేని ప్రభాకర్.
- ప్రజా సంక్షేమ పాలనను మెచ్చి స్వచ్ఛందంగా చేరడం శుభపరిణామం చింతమనేని.
- మసీదుపాడు అభివృద్ధికి ఎమ్మెల్యే చింతమనేని భరోసా.

**దెందులూరు, పెన్ సత్తా, అక్టోబర్ 04:** నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై, అహర్నిశలు తన నియోజకవర్గ ప్రజల కోసమే శ్రమించే దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ నాయకత్వం పై సంపూర్ణ విశ్వాసంతో దెందులూరు మండలం మసీదుపాడు గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆదివారం మసీదుపాడు గ్రామంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు, మహిళలకు ఆయన స్వయంగా పసుపు కండువాలు కప్పి సాదరంగా టీడీపీ లోకి ఆహ్వానించారు అంతకు ముందు గ్రామం లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే చింతమనేని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతా సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీకి, ఆ తర్వాత వైసీపీకి మసీదుపాడు ఒక కంచుకోటగా ఉండేదని, అలాంటి గ్రామంలో ఎలాంటి ఎన్నికల వాతావరణం లేనప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా కూటమి ప్రభుత్వ అభివృద్ధిని మెచ్చి టీడీపీ జెండా పట్టడం ఎంతో శుభపరిణామమని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుంచి ప్రతి ఇంటి సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ అన్ని విధాలా కొండంత అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామంలో గతంలో తారురోడ్డు వేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో మసీదుపాడు నుంచి అలుగులగూడెం మీదుగా మెయిన్ రోడ్డును కలుపుతూ రూపుదిద్దుకునేలా నూతన తారురోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించి, గ్రామానికి సమగ్ర రవాణా సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గ్రామం లోని సమస్యలను గుర్తించాలని, మసీదుపాడు రూపురేఖలు మార్చే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. చేరిన ప్రతి ఒక్కరి ఆర్థిక, సామాజిక వివరాలు సేకరించి ప్రభుత్వ పథకాల ద్వారా వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి కసుకుర్తి రామకృష్ణ, జోగన్నపాలెం సొసైటీ చైర్మన్ డాక్టర్ పసుమర్తి మధు, గాలాయగూడెం సొసైటీ చైర్మన్ పూజారి వెంకటరత్నం నాయుడు, కో- క్లస్టరు ఇంచార్జ్ మారగాని సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షులు చింతా సుబ్బారావు, యూనిట్ ఇంచార్జ్ కొయ్యూరి గంగరాజు, కూటమి నాయకులు ఏనుగు, రామక్రిష్ణ, కొడాలి, ఆంజనేయులు, మాగంటి గిరి, వెలివెల నాగరాజు, ఏనుగు ఆచారావు, కొండేటి శ్రీనివాస్, దొండా శ్రీనివాస్, కొండేటి హనుమంత్, తోట రామక్రిష్ణ, డి.బాలగోపాల్, శ్రీధర్ సహా పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు నూతనంగా పార్టీలో చేరిన కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# కూటమి హయాంలో రావులపాలెం అభివృద్ధి వేగవంతం బండారు.



**పల్లె పండుగ 3.0 లో భాగంగా రూ.2.83 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు.**

**కొత్తపేట, పెన్ సత్తా, అక్టోబర్ 04:** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ప్రజల యొక్క సమస్యలను పరిష్కరిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. పల్లె పండుగ 3.0లో భాగంగా రావులపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి పాలన వస్తే ప్రజలకు మంచి జరుగుతుంది, ప్రజలు కోరుకున్న అభివృద్ధి కార్యక్రమాలు అన్ని పూర్తవుతాయని ఎన్నికల ముందు చెప్పడం జరిగిందన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, గత ఐదేళ్ల వైసిపి పాలనలో అడుగంటిపోయిన అభివృద్ధిని ముందుకు తీసుకుని వస్తూ గ్రామాల్లో అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలు పూర్తి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం నాడు రావులపాలెంలో రూ.2.83 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపట్టినట్లు తెలిపారు. ఎక్కడికి వెళ్ళినా కూటమి నాయకులు చేస్తున్న అభివృద్ధికి ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను చూసి ఆనందిస్తున్నారన్నారు. ఇంకా మిగిలిపోయిన వారి సమస్యలను తెలియజేస్తున్నారని, వీటిని కూడా చేయండని అడుగుతున్నారని, తప్పకుండా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ అభివృద్ధి ఈ విధంగానే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఎన్డీఏ కూటమి పదికాలాలపాటు అధికారంలో ఉండాలని, ప్రజల సంక్షేమ అభివృద్ధి రెండింటిని అందు కోవాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోందన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధి కోసం, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం, రాష్ట్రం కోసం పాటుపడుతున్నారన్నారు. ఈ అభివృద్ధి ఈ విధంగానే కొనసాగాలి అంటే కూటమికి అండగా నిలవాలని ఆయన అన్నారు. ఐ లవ్ యు రావులపాలెం, కోనసీమ ముఖ ద్వారాన్ని బ్యూటిఫికేషన్ చేయడం జరిగిందన్నారు. కళా వెంకట్రావు విగ్రహం, వాడపల్లి వెంకటేశ్వర స్వామి ముఖద్వారం వీటన్నిటిని తీర్చిదిద్ది రావులపాలెం సెంటర్ ఎంతో అందంగా ఉండేలా తయారుచేయడం జరుగుతుందన్నారు. రావులపాలెం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ప్రణాళికాబద్ధంగా సింహాచలం అభివృద్ధి గంటా.

**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 04:** సింహాచలం దేవస్థానంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాల చేపట్టాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.వెంకట్రావు కలిశారు. దేవస్థానంలో జరుగుతున్న ఉత్సవాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. ట్రస్టు బోర్డులో ఆమోదించిన వివిధ ప్రతిపాదనలను తెలియజేశారు. సింహాచలం దేవస్థానం స్వచ్ఛ అవార్డు సాధించినందుకు ఈఓను గంటా అభినందించారు. సింహాద్రి అప్పన్న స్వామి వారి ప్రసాదాన్ని, పవిత్రాలను ఈఓ అందజేశారు.



# ఎన్నికల సమీక్ష సమావేశంలో దాడి



**పార్వతీపురం, పెన్ సత్తా, అక్టోబర్ 04:** పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గుమ్మ లక్ష్మీపురం లో ఎమ్మెల్యే ఇంటి వద్ద స్థానిక శాసనసభ్యులు తోయ్యాక జగదీశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుగుబిలి మండలం కార్యకర్తల సమీక్ష సమావేశం కు ముఖ్య అతిథిగా జిల్లా ఎన్నికల ఇన్చార్జ్ దాడి రత్నాకర్, నియోజవర్గ పరిశీలకులు మాదారపు వెంకటేష్ పాల్గొని మండలం లోని పార్టీ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, క్లస్టర్ ఇంచార్జ్ యూనిట్ ఇన్చార్జి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల్లో తీసుకోవలసిన చర్యల పై చర్చించి మండలంలోని సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి తీసుకోవలసిన చర్యల పై చర్చించారు.

# సమృద్ధిగా వర్షాలు కురవాలని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో వరుణ యాగం.

- వరుణ యాగంలో పాల్గొనాలని వంశీకృష్ణ శ్రీనివాస్ కి ఆహ్వాన పత్రికను అందజేసిన ఈవో, చైర్మన్.





**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 04**: రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజల సంక్షేమం, శ్రేయస్సు చేకూరాలని ఆకాంక్షిస్తూ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో వరుణ యాగం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కి వరుణ యాగానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను శోభారాణి, ఆలయ చైర్మన్ కందుల నాగరాజు అందజేశారు. అక్టోబర్ 6, 2026 మంగళవారం ఉదయం 6:54 గంటలకు కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో వరుణ యాగం ప్రారంభమవుతుందని వారు తెలిపారు. అమ్మవారి కృపతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొననున్నారు.

# రాంబిల్లిలో రైతు మృతి పై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కరణం ధర్మశ్రీ.



**రాంబిల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 04:** మండలం లోని గొరపూడి పంచాయతీలో నిన్న జరిగిన భూ సేకరణ కార్యక్రమం సందర్భంగా చోటుచేసుకున్న తోపులాటలో ఓ రైతు గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. మృతి చెందిన రైతు కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అక్కడికి వెళ్లారు. అయితే, అక్కడ మృతి చెందిన రైతుకు కనీసం టెంట్ ఏర్పాటు చేసుకునేందుకు కూడా అధికారులు, పోలీసులు అనుమతించకుండా అడ్డుకున్నారనే విషయం ఆయన దృష్టికి రావడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మృతి చెందిన రైతుకు అంత్యక్రియలు నిర్వహించుకునే సమయం లోనూ, టెంట్ ఏర్పాటు చేసుకునేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయం పై ఆర్డీవో తో ఫోన్‌లో తీవ్ర స్థాయిలో మాట్లాడి, అధికారుల తీరు పై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక రైతు ప్రాణం కోల్పోయిన విషాద సమయంలో నైనా మానవత్వంతో వ్యవహరించాలి. మృతి చెందిన రైతు కుటుంబానికి కనీస గౌరవం ఇవ్వకుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అంటూ కరణం ధర్మశ్రీ అధికారులను నిలదీశారు.

## ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత.



**పెన్ సత్తా, డెస్క్:** ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూశారు. చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. వయోభారంతో ఆయన మృతి చెందారు. చివరిగా ఆయన 'సింగ్ గీతం' అనే సినిమాకి దర్శకత్వం వహించారు. 94 ఏళ్ల వయసు లోనూ దర్శకత్వం వహించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఈయన దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా 1991లో వచ్చిన ఆదిత్య 369 మూవీ అప్పట్లో సంచలనం సృష్టించింది. అయన మృతి పై పలువురు నాయకులు, ఇండస్ట్రీ వాళ్ళు విచారం వ్యక్తం చేస్తూ, సంతాపం తెలిపారు.

## జల జీవన్ మిషన్ కార్యక్రమ సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సవిత.

30 వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్.







**ప్రొద్దుటూరు, పెన్ సత్తా, అక్టోబర్ 04:** కడప జిల్లా జల జీవన్ మిషన్‌లో భాగంగా రూ.30 వేల కోట్ల నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి ప్రాజెక్టుల కల్పనకు 5 వతేదీన ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను, వేదిక నిర్మాణం, ప్రజలకు కల్పించనున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత నాయకులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాల్గొననున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జల జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రం లోని ప్రతి ఇంటికీ సురక్షిత మైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేశ్ రెడ్డి, సత్యనారాయణ రాజు, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్‌తో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కామాక్షి దేవి నవరాత్రులు ఉత్సవాల పుస్తకావిష్కరణ.




**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 04:** నిదానదొడ్డి లో వేంచేసియున్న కామాక్షి దేవి దసరా నవరాత్రి మహోత్సవాలు ఆదివారం అమ్మవారి ఆలయ మండపంలో దసరా నవరాత్రి మహోత్సవాల పుస్తకాన్ని విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ గత ఏడాది వలె ఈ ఏడాది కూడా అమ్మవారి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని వారు తెలియజేశారు. నవరాత్రులు లో ప్రతిరోజు ఒక ఆవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనాలు ఇస్తారని, ఈనెల 11 తారీకు మొదటిరోజున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగింపు జరుగుతుందని అని తెలియజేశారు. ఆలయం వద్ద ఎస్ భారతి భాగవతారిణి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర హరికథా కాలక్షేపము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం అధ్యక్షులు పొన్నాడ వెంకట సత్య నర్సింగ్ ఆచారి (పెదబాబు), ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కోశాధికారి కిలాడ శ్రీనివాసరావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు వెదురుపాటి సుందరయ్య (బాబి), పట్టణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నూకాంబికా అమ్మవారిని దర్శించుకున్న హోం మంత్రి అనిత.





కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు.

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 04:** అనకాపల్లి పట్టణం లోని నూకాంబికా అమ్మవారిని హోం మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయానికి చేరుకున్న హోం మంత్రి అనితకు స్థానిక నాయకులు, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అనిత అమ్మవారి ఆశీస్సులు పొందారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు హోం మంత్రి అనితకు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని మంత్రికి బహూకరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనితతో పాటు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కూడా నూకాంబికా అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





# ఘనంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జన్మదిన వేడుకలు.

- యార్లగడ్డ కు శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు.
- ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జన్మదిన వేడుకల్లో భాగం గా భారీ కేక్ కట్ చేసిన యార్లగడ్డ.
- యార్లగడ్డ జన్మదిన వేడుకలకు భారీగా తరలివచ్చిన అభిమానులు.
- తనను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన యార్లగడ్డ.
- జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా దుర్గమ్మను దర్శించుకున్న యార్లగడ్డ.
- యార్లగడ్డ కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం అందించిన ఆలయ అర్చకులు.



**గన్నవరం, పెన్ సత్తా, అక్టోబర్ 04:** ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు జన్మదిన వేడుకలు గన్నవరం లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగాయి. ఈ వేడుకలకు నియోజకవర్గం లోని పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై యార్లగడ్డ వెంకట్రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచే ఎమ్మెల్యే కార్యాలయానికి వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. యార్లగడ్డ వెంకట్రావును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు ఆయనను సత్కరించారు. అనంతరం జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. యార్లగడ్డ వెంకట్రావుకు ఆయురారోగ్యాలు కలగాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం లభించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఎమ్మెల్యే కార్యాలయం సందడిగా మారింది. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారిని యార్లగడ్డ వెంకట్రావు ఆప్యాయంగా పలకరించారు. తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు చూపిన ఆదరణ పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అంతకు ముందు జన్మదినం సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సమేతంగా విజయవాడ ఇంద్రకీలాద్రి పై కొలువైన దుర్గాదేవిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక ఏర్పాట్ల మధ్య అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు. జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని కోరుకున్నట్లు చెప్పారు.

# జనసేన తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు.

పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించిన పంచకర్ల.

**పెందుర్తి, పెన్ సత్తా, అక్టోబర్ 04:** నియోజకవర్గం జీవీఎంసీ 77 వ వార్డు వైసీపీ నాయకులకు జనసేన పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. ఆదివారం వైసిపి జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి, జీవిఎంసీ 77 వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోవిరి షణ్ముఖ శివ కుమార్ తో సహా సుమారు 300 మంది వైసీపీ కార్యకర్తలకు జనసేన కండువాలు కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించిన పంచకర్ల. ఈ సందర్భంగా కూటమి స్ఫూర్తిని దెబ్బతీయకుండా కలిసి, మెలిసి పనిచేయండి అని వారికి రమేష్ బాబు సూచించారు. కూటమి స్ఫూర్తిని దెబ్బతీయకుండా పార్టీ నాయకులందరూ కలిసిచ మెలిసి పని చేయాలని శాసన సభ్యులు పంచకర్ల రమేశ్ బాబు పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశినం చేసారు. సుజాతనగర్ క్యాంప్ కార్యాలయంలో జీవిఎంసీ 77 వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆ పార్టీ వాణిజ్యవిభాగం జిల్లా కార్యదర్శి కోవిరి షణ్ముఖ శివకుమార్ సహా పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. వారందరికి జనసేన కండువాలు వేసిన ఎమ్మెల్యే రమేశ్ బాబు పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధినేత కొణదల పవన్ కళ్యాణ్ సిద్దాంతాలు నచ్చడంతో పాటు గతంలో తనతో గల అనుభంధంతో శివకుమార్ జనసేనలో చేరడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయాలనే తపన, చురుకుతనం గల శివకుమార్ చేరికతో 77 వ వార్డులో పార్టీ బలం మరింత పెరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వచ్చే కార్పోరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్ధులందరూ తప్పని సరిగా గెలిచేలా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. అలాగే సీట్లు కేటాయింపు అధినేత మాత్రమే చేస్తారని, ఎవరికి సీటు వచ్చినా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నిర్దేశించారు. పార్టీలో ఉన్న నాయకులందరూ సమన్వయంతో పనిచేసి స్థానికంలో నూరు శాతం విజయాలు నమోదు చేసి అటు పార్టీకి ఇటు వ్యక్తిగతంగా నాకు మంచి పేరు తీసుకురావాలని జనసైనికులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు మార్గనిర్దేశినం చేసారు. జనసేన పార్టీ కండువా కప్పుకున్న ముఖ్యులలో అప్పికొండ శివాలయం మాజీ చైర్మన్ గంగరాజు, సీనియర్ నాయకులు షేక్ రేష్మ బేగం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దేవాడ బూత్ కన్వీనర్ కూర్మా అప్పారావు, రషీద్, మోస, కాసు కుమార్, జయరామ్, మాజీ శివాలయం ట్రస్ట్ బోర్డు మెంబర్ సోమ నాయుడు, కమల్ హాసన్, మహేష్, ప్రసాద్, తదితర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పార్టీ కండువా కప్పుకున్నారు. త్వరలో మరిన్ని చేరికలు ఉంటాయని వెల్లడించిన ఎమ్మెల్యే రమేశ్ బాబు మంచి రోజు కావడంతో ఇపుడు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పంచకర్ల ప్రసాద్ రావు, స్థానిక వార్డు అధ్యక్షులు కాకి బాబు, జనసేన పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బుగిడి రామ గోవింద రావు, అప్పికొండ శివాలయం చైర్మన్ పరదేశి, వారా పైడి నాయుడు తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ఉచిత కంటి వైద్య శిబిరం.




**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 04:** మండలం లోని వాడచీపురుపల్లి గ్రామంలో సంత బయలు స్టేజీ వద్ద ఆదివారశీ ఉచిత కంటి వైద్య శిబిరం అమ్మ చారిటబుల్ ట్రస్ట్, అమ్మ కంటి ఆసుపత్రి సంయుక్తంగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారిచే నిర్వహించడ మైనది. ఈ కంటి వైద్య శిబిరాన్ని ట్రస్ట్ సభ్యులు, అమ్మ కంటి ఆసుపత్రి ప్రతినిధులు కలసి ప్రారంభించారు. అలాగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎస్. అర్జున, ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సింగంపల్లి రామారావు, మంగి గణపతి, మాసవరపు అప్పల నాయుడు (మాజీ ఎంపీపీ), పయిల వెంకట లక్ష్మీ (అఫ్తాల్మిక్ ఆఫీసర్), కూండ్రపు రాంబాబు (అమ్మ కంటి ఆసుపత్రి) మొ,,వారు పాల్గొన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 107 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఒ ఐ డ్రాప్స్ అందించడ మైనది. అలాగే 26 మంది రోగులను కంటి ఆపరేషన్స్ కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి ఈ రోజే బస్ లో ఆపరేషన్ నిమిత్తం తీసుకు వెళ్లడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, పేదలకు వైద్య సేవలు అందిస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ బృందాన్ని గ్రామ సర్పంచ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఈ వైద్య శిబిరం లో శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణలు డా. పి. సత్యవతి, కాంప్ మేనేజర్ అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ ఉష, ఇతర వైద్య సిబ్బంది, యూత్ మొ..వారు పాల్గొన్నారు.

# బీజేపీ మండల విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం.

**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 04:** మండల విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం తాడి గ్రామంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి మండల అధ్యక్షులు పిల్లా సతీష్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో సంస్థాగత విషయాలు, పార్టీ సిద్ధాంతం, స్థానిక ఎన్నికల గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు పట్టాభి ప్రసాద్ హాజరు కాగా మండల ప్రభారి జే వి ఎస్ రాజు, సీనియర్ నాయకులు ముత్యాల అప్పారావు, రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు కూండ్రపు సోము నాయుడు, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు దత్తి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు దాలిబోయిన సంజీవరావు, మండల ప్రధాన కార్యదర్శులు బంతికోరు గోవింద రాజు, పండూరి రమేష్ తదితర మండల పదాధికారులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.





# మత్స్యకార సొసైటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించండి



**నక్కపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 04:** మత్స్యకార సొసైటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు వెలగ సుధాకర్ కోరారు. కూటమి పార్టీ తరఫున రాజయ్యపేట మత్స్యకార సొసైటీ అధ్యక్షులు పోటీలో నిలిచిన ఎరుపల్లి బంగారయ్యకు రాజయ్యపేట గ్రామ మత్స్యకారులందరూ తప్పనిసరిగా ఓటు వేయాలని ఆదివారం ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తుందని మత్స్యకార భరోసా కూడా పదివేల నుండి 20వేల రూపాయలకు పెంచారని అన్నారు. హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల బీసీలకు కూడా రాజయ్యపేటలోనే నిర్మించడం జరిగిందని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ గడ్డం బుజ్జి ఆదేశాలతో జనసేన పార్టీ ఈ ఎలక్షన్లలో చురుగ్గా పాల్గొంటుందని కూటమి అభ్యర్థి విజయానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి దాడిశెట్టి ఈశ్వరరావు జనసేన ఉపాధ్యక్షులు రత్నాజీ ప్రధాన కార్యదర్శులు గుర్రన్న శ్యాం కిషోర్ కార్యదర్శులు గణపతి రాజంపేట గ్రామ అధ్యక్షులు కోదండరాం తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు రాంబాబు గంగరాజు మాజీ సొసైటీ అధ్యక్షులు కోదండరాం గ్రామ కూటమి నాయకులందరూ పాల్గొన్నారు.

# విద్యార్థులను సన్మార్గంలో నడిపించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదే.




జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాజేష్ అభినందన సభలో ఎస్పీ.



**విజయనగరం, పెన్ సత్తా, అక్టోబర్ 04:** జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపి కై, ఇటీవల భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్న నెల్లిమర్ల మండలం చనమల్లుపేట పాఠశాల ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న కొలూరి రాజేష్ కు విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులను చెడు మార్గాల్లో పయనించకుండా, వారిని సన్మార్గంలో నడిపించే గురుతర బాధ్యత వారి తల్లిదండ్రులతోపాటు, ఉపాధ్యాయుల పై కూడా ఉందన్నారు. గంజాయి, బెట్టింగ్స్, మద్యం, మహిళలు, విద్యార్థినుల పట్ల వేధింపులకు పాల్పడడం వంటి విషయాల పట్ల ఆకర్షితులు కాకుండా, చెడు వ్యసనాల దుష్ప్రభావాలను, పరిణామాలను అవకాశం ఉన్న ప్రతీసారి విద్యార్థులకు వివరించాలన్నారు. విద్యార్థులు లక్ష్యాల వైపు పయనించే విధంగా, ఉన్నత స్థానాలకు చేరుకొనే విధంగా ఉపాధ్యాయులు చూడాలన్నారు. చదువుతోపాటు విద్యార్థులకు నైతిక విలువలు గురించి వివరించి, వారిని మంచి పౌరునిగా తీర్చిదిద్దాలని, నేరరహిత సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కూడా భాగస్వామ్యులు కావాలన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో కొలూరి రాజేష్ ఒకేసారి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం విధి నిర్వహణలో అతని నిబద్ధతను తెలియజేస్తున్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో దేశ స్థాయిలో జిల్లా పేరును కొలూరి రాజేష్ నిలిపారన్నారు. విద్యార్థులకు చదువు చెప్పడంలో రాజేష్ నిబద్ధత, అంకిత భావం జాతీయ స్థాయి అవార్డు అందుకోవడంలో దోహదపడిందన్నారు. రాజేష్ ఉన్నత స్థానం చేరుకోవడంలో భాగస్వాయు లైన అతని తల్లిదండ్రులు, భార్య, ఇతర కుటుంబ సభ్యులు, విద్యను నేర్పిన ఉపాధ్యాయులు, సహకారాన్ని అందించిన సహోద్యోగులు, సహ విద్యార్థులు అందరికి జిల్లా ఎస్పీ అభినందించారు. అనంతరం, జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత కొలూరి రాజేష్, వసుంధర దంపతులను జిల్లా ఎస్పీ దామోదర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, వివిధ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, గుంటూరు బోయపాలెం డైట్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భార్యాభర్తల ను తిరిగి కలపడమే పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ లక్ష్యం-డి.ఎస్.పి జగన్నాథరాజు

**ధర్మవరం,అక్టోబర్ 04 (పెన్ సత్తా)** భార్యాభర్తలను తిరిగి కలపడమే పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్,లక్ష్యము అని డిఎస్పి జగన్నాథ రాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,జిల్లా ఎస్పీ,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ధర్మవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ను ఇదివరకే ఏర్పాటు చేశామని తెలిపారు. డివిజన్ పరిధిలోని 10 పోలీస్ స్టేషన్లో భార్యాభర్తల గొడవ ఏదైనా ఉంటే ఆయా పోలీస్ స్టేషన్ ద్వారా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ కు సమాచారాన్ని అందించితే, ప్రత్యేకంగా భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చేసి కలిపే ప్రయత్నం తప్పక చేయడం జరుగుతుందని తెలిపారు. చిన్న చిన్న తగాదాలు, సూటిపోటి మాటలతో భార్యాభర్తలు విడిపోయిన సంఘటనలు లో తిరిగి కౌన్సిలింగ్ చేసి కలిపిన సంఘటనలు చాలా ఉన్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే ఇప్పటివరకు 67 మంది భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇవ్వగా 58 మంది జంటలను కలపడం జరిగిందన్నారు. కావున ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



## బాలికలు, మహిళల భద్రతే పోలీసుల ప్రధాన ధ్యేయం.

శక్తి టీమ్' ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం.






**పాయకరావుపేట, పెన్ సత్తా, అక్టోబర్ 04:** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, పాయకరావుపేట స్టేషన్ హౌస్ ఆఫీసర్ వినోద్ బాబు పర్యవేక్షణలో స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి లోని బాలికల ఉన్నత పాఠశాల, కార్తికేయ జూనియర్ కళాశాలల్లో "శక్తి టీమ్" ప్రత్యేక పర్యటన నిర్వహించింది. ?ఈ సందర్భంగా శక్తి బృందం సభ్యులు పాఠశాల, కళాశాల విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడి, వారి భద్రత కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ అమలు చేస్తున్న వివిధ సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈవ్-టీజింగ్ ఒ ర్యాగింగ్ నిరోధం: పాఠశాల, కళాశాలల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు తారసపడినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శక్తి యాప్ ఒ టోల్ ఫ్రీ నంబర్లు: అత్యవసర సమయాల్లో విద్యార్థినులు ఉపయోగించుకోవడానికి 'డైల్ 112', 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగం గురించి వివరించారు.

సైబర్ నేరాల పై మెలకువలు: సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదనే అంశాలపై స్పష్టతనిచ్చారు. ?మహిళలు, విద్యార్థినుల రక్షణకు పాయకరావుపేట పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమస్య ఎదురైనా ధైర్యంగా స్టేషన్‌ను గానీ, పెట్రోలింగ్‌లో ఉన్న శక్తి టీమ్‌ను గానీ సంప్రదించవచ్చని ఎస్‌హెచ్‌ఓ వినోద్ బాబు తెలిపారు.

# దుర్గాదేవి రాట మహోత్సవం.





**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 04:** గ్రామంలో బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రులు మహోత్సవ సందర్భంగా దుర్గాదేవి రాట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల పరిశీలికులు పయిల శ్రీనివాస రావు, పరవాడ మాజీ ఎంపీపీ పయిల వెంకట పద్మ లక్ష్మీ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మవారి కృపా కటాక్షాలు అందరికీ ఉండాలని, ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలని అభిలాషించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది దుర్గాదేవి మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు యూత్ సభ్యులు చేస్తున్న ప్రయత్నాలను ఆయన అభినందించారు. గత కొన్నేళ్లుగా అమ్మవారి శరన్నవరాత్రుల మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ నెల 11 వ తేది నుండి 20 తేది వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, కుంకుమ పూజలు, అభిషేకాలు హోమాలతో పాటుగా అమ్మవారికి పల్లకి సారీ, అఖండ దీపారాధన, అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులు ఉత్సవాలలో పాల్గొని దుర్గాదేవి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చుక్క రాము నాయుడు, పయిల అప్పల నాయుడు(సాయి), పయిల అప్పల నాయుడు సత్యవేణి, పయిల హరీష్, టి.డి.పి జిల్లా సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి పయిల రామ చంద్ర రావు, పయిల అప్పారావు(టి.వి), వై.సి.పి నాయకులు పయిల పోతు నాయుడు, దెక్క చెల్లా రావు, యూత్ సభ్యులు లాలం ముత్యాల నాయుడు, పయిల లక్ష్మణ రావు, రెడ్డి గణేష్ , గండి మహేష్, గండి ముకేశ్, రెడ్డి రామారావు, వగ్రీ హరి, చిరికి శ్రీను, గొల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పద్మవ్యూహం...వైసీపీ తట్టుకోగలదా ?



ఏపీలో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను త్వరలో నిర్వహించనుంది. అయితే 2021లో వైసీపీ ప్రభుత్వం హయాంలో కూడా స్థానిక ఎన్నికలు జరిగాయి. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటి అంటే ఆనాడు పరోక్ష ఎన్నికలు జరిగాయి. మేయర్ జెడ్పీ చైర్మన్లను సభ్యులు ఎన్నుకునే వారు. దాంతో పెద్ద ఎత్తున సభ్యుల బలం కోసం ఏకగ్రీవాలను వైసీపీ ప్రోత్సహించింది అన్న విమర్శలు వచ్చాయి. అంతే కాదు ప్రతిపక్ష పార్టీలు నామినేషన్లు కూడా వేయకుండా అధికార బలంతో అడ్డుకుందని కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో జెడ్పీ ఎన్నికల నుంచి టీడీపీ మధ్యలోనే తప్పుకుని తన నిరసనను వ్యక్తం చేసింది. మొత్తానికి నూటికి తొంబై శాతం దాకా వైసీపీ గెలిచి లోకల్ బాడీస్ లో పాగా వేసింది. అయినా ఏమి లాభం, 2024 లో ఈ స్థానిక ఎన్నికల ఫలితాలు పెద్దగా ఉపయోగపడలేదు, వైసీపీ చిత్తుగా ఓటమి పాలు అయింది.

**కట్ చేస్తే కూటమి సర్కార్ :**
ఇక ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థానిక ఎన్నికలను నిర్వహిస్తోంది. ఈ ఎన్నికల్లో నిజానికి వైసీపీ మొదట పాల్గొనరాదనే చర్చ సాగింది అని అంటున్నారు. ఎపుడైతే మేయర్ జెడ్పీ చైర్మన్లు మునిసిపలి చైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమలులోకి తీసుకుని వచ్చారో దాంతో వైసీపీలో కొత్త ఆశలు చిగురించాయి. ప్రత్యక్ష ఎన్నికలు కాబట్టి కీలక పదవుల విషయంలో పార్టీ జెండా జగన్ ఇమేజ్ ఉపయోగపడతాయని భావిస్తూ ఆ పార్టీ పోటీ చేయాలని నిర్ణయించుకుంది. ఇక జగన్ అయితే వెరీ సీరియస్ అన్నట్లుగా లోకల్ బాడీ ఎన్నికలను తీసుకున్నారు. పదే పదే పార్టీ సమావేశాలలో ఆయన ఎన్నికలు చాలా కీలకం అని ప్రస్తావిస్తున్నారు. పార్టీ శ్రేణులను ఆయన ఎన్నికల సమరం వైపుగా నడిపించే ప్రయత్నం చేస్తూ ఉత్సాహం నింపుతున్నారు.

**అదే సందేహంగా :**
అంతవరకూ బాగానే ఉంది కానీ కూటమి ప్రభుత్వం కూడా ఆనాడు వైసీపీ చేసినట్లుగా అధికార బలం చూపిస్తే ఏమవుతుంది అన్నదే ఫ్యాన్ పార్టీలో సందేహంగా ఉంది. నామినేషన్ల నుంచే నాడు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు ప్రతిపక్షాలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి ఉంటుందా అని చర్చిస్తున్నారు. అభ్యర్థులను నిలబెట్టడం వరకూ అయితే వైసీపీ అధినాయకత్వం వారికి ఉత్సాహం ఇస్తోంది. అయితే వారు రంగంలో చివరి దాకా ఉండాలి. అధికార కూటమి ఒత్తిళ్లను తట్టుకోవాల్సి ఉంటుంది. అంతే కాదు పోలీసులను ప్రయోగిస్తే ధీటుగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక అభ్యర్థులుగా ఉన్న వారి చరిత్రను మొత్తం తిరగతోడే చాన్స్ ఉంది. ఇలా అన్ని వైపుల నుంచి వచ్చే కష్టాలను నష్టాలను భరిస్తూ వైసీపీ శ్రేణులు ఎంతవరకూ ముందుకు వెళ్తాయి అన్నది పార్టీ పెద్దలలో కూడా ఉంది అని అంటున్నారు.

**నిలిచి పోరాడితేనే :**
అన్ని ఇబ్బందులు అధిగమించి నిలిచి పోరాడితేనే వైసీపీ గెలిచినట్లు అని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకూ చూస్తే ప్రజాభిప్రాయంలో పెద్దగా తేడా ఏమీ ఉండదని అంటున్నారు. ఇంకా కూటమి చేతిలో సగం పాలన ఉండగా జనాలు ప్రతిపక్షాన్ని గెలిపించి అభివృద్ధిని తమ ప్రాంతంలో దూరం చేసుకోరని కూడా అంటున్నారు. అందువల్ల వైసీపీ పెద్ద ఎత్తున గెలిచేస్తుంది అన్నది ఆ పార్టీలో ఉత్సాహం కోసం అన్నట్లుగానే చూడాలని అంటున్నారు అదే సమయంలో వైసీపీ తుది వరకూ పోరాడి తన ఓటు బ్యాంక్ ని కాపాడుకుంటూ నిలిస్తే మాత్రం అదే అసలైన గెలుపుగా చూడాలని అంటున్నారు. అధినాయకత్వం కూడా అందుకోసమే పోటీకి దింపుతోందని చెబుతున్నారు. మరి వైసీపీ తట్టుకుంటుందా అన్నదే అతి పెద్ద ప్రశ్నగా ఉంది.

# అందుకే కళ్ళు మూసుకున్నాం... చిన్న శ్రీనుపై బొత్స !



విజయనగరం జిల్లాలో స్థానిక ఎన్నికల రాజకీయం కంటే కూడా వైసీపీలో చిన్న శ్రీను ప్రకంపనలు తదనంతర పరిణామాలే ఎక్కువ హీట్ ని పుట్టిస్తున్నాయి. చిన్న శ్రీను పార్టీని వీడి నెల రోజులు అవుతున్నా ఆ ప్రభావం వైసీపీని స్థిమితం లేకుండా చేస్తోంది. తాజాగా చిన్న శ్రీను వియ్యంకుడు బడ్డుకొండ అప్పలనాయుడు సస్పెండ్ అయ్యారు. దాంతో ఆగ్రహించిన ఆయన వైసీపీకి గుడ్ బై చెప్పారు. మరిన్ని వికెట్లు పడబోతున్నాయని చిన్న శ్రీను వర్గం ఒక వైపు సంకేతాలు ఇస్తోంది. విజయనగరం జిల్లా వైసీపీ అంటేనే మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నంతగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ మొత్తం పరిణామాల మీద బొత్స తనదైన శైలిలో స్పందించారు. ఎస్ కోట నియోజకవర్గంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బొత్స మాట్లాడుతూ పార్టీని వీడిన వారిది దోపిడీయే అజెండా అని హాట్ కామెంట్స్ చేశారు.

**పోతే ఏటవుతాది :**
బొత్స ఉత్తరాంధ్ర భాషలో మాట్లాడుతూ పార్టీ అన్నాక ఇలాంటివి సహజం అన్నారు. ఒకరిద్దరు నాయకులు బయటకు వెళ్ళినంత మాత్రాన ఏమవుతుందని ప్రశ్నించారు. పార్టీ ఎప్పటికీ శాశ్వతం అన్నారు. వైసీపీకి జనంలో ఆదరణ ఉందని ప్రజలు పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. అందువల్ల నాయకులు వెళ్తే పార్టీకి ఏమీ కాదని చెప్పారు. స్వార్థంతో స్వలాభంతోనే కొందరు పార్టీని వీడిపోతున్నారు అని ఆయన మండిపడ్డారు. నాయకులు వెళ్ళినంత మాత్రాన కార్యకర్తలకు ఎలాంటి నష్టం లేదని అన్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందని బొత్స చెప్పారు.

**ప్రేమ ఎక్కువైపోయి :**
చిన్న శ్రీను పార్టీని వీడడం మీద బొత్స వ్యాఖ్యానిస్తూ అభిమానం ప్రేమ ఉన్న చోట కళ్ళు మూసుకుని పోతాయని వ్యాఖ్యానించారు. అందువల్లనే ఇన్నాళ్ళూ కొన్ని విషయాలని పట్టించుకోలేదని అన్నారు. అది తమ అవివేకం కూడా కావచ్చు లేదా అశ్రద్ధ కూడా కావచ్చు అని బొత్స తన మీదనే సెటైర్లు వేసుకున్నారు. ఆనాడు దృష్టి పెట్టకపోవడం వల్లనే ఇలాంటివి జరిగాయని, ఇలా ఫిరాయిస్తున్న వారి అసలు ఉద్దేశ్యాలు కూడా ఆలస్యంగానే అర్థం అయ్యాయని ఆయన చెప్పుకొచ్చారు. ఈసారి చాలా జాగ్రత్తగా ఉంటామని కార్యకర్తలకే పెద్ద పీట వేస్తామని ఆయన చెప్పారు.

**కష్టపడిన వారికే :**
ఎవరైతే పార్టీ కోసం పనిచేస్తారో కష్టపడతారో వారికే ప్రాధాన్యత ఉంటుందని బొత్స అన్నారు. తాను క్యాడర్ కి అండగా ఉంటాను అని ఆయన హామీ ఇచ్చారు. ఏపీలో కూటమి పాలన తీరు మీద కూడా ఆయన నిప్పులు చెరిగారు. తన మొత్తం రాజకీయ జీవితంలో ఈ తరహా దోపిడీ పాలన చూడలేదని బొత్స మండిపడ్డారు. ప్రజలతో కలిసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాల మీద వైసీపీ ఉద్యమిస్తుందని బొత్స స్పష్టం చేశారు.

**బొత్స చెప్పిందేంటి :**
ఇవన్నీ పక్కన పెడితే బొత్స చెప్పిందేంటి అన్నది వైసీపీలో చర్చ సాగుతోంది. సొంత మేనల్లుడు కాబట్టే చూసీ చూడనట్లుగా వ్యవహరించామని ఇపుడు ఆయన పశ్చాతాపం పడుతున్నారా అన్నది కూడా ఆలోచిస్తున్నారు. బొత్సకు చిన్న శ్రీను పార్టీని వీడడం వంటి పరిణామం అయితే ఇబ్బందికరంగా మారిందనే అంటున్నారు. పోయే వారు పోతారు అని తేలికగా అంటున్నా జిల్లా రాజకీయాల్లో వైసీపీకి అలాగే బొత్స ఆధిపత్యానికి ఒక సవాల్ గానే ఈ పరిణామాలు ఉండబోతున్నాయని కూడా విశ్లేషిస్తున్నారు.

# ఐరోపా అంటుకుంది.. ఆ రెండు దేశాలు అట్టుడుకుతున్నాయి..




: ఐరోపా ఖండంలోని రెండు ఆర్థిక వ్యవస్థలైన ఫ్రాన్స్, స్పెయిన్‌లు ప్రస్తుతం తీవ్ర సామాజిక, రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ వేలాది మంది ప్రజలు, యువత రోడ్లపైకి వచ్చి చేస్తున్న ఆందోళనలు ఆయా దేశాలలో కలకలం సృష్టిస్తున్నాయి. వేర్వేరు అంశ ప్రాతిపదికన ఈ నిరసనలు ఉద్భవించినప్పటికీ.. ప్రభుత్వాల విధానాల పట్ల పౌరుల్లో పెరుగుతున్న అసంతృప్తి, నిరాశలు ఈ పోరాటాలకు ప్రధాన ఇంధనంగా మారాయి. రోజువారీ జీవితాన్ని శాసిస్తున్న ప్రాథమిక వసతుల కరవుపై పౌరులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
ఫ్రాన్స్‌లో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. దేశ విద్యావ్యవస్థలో పేరుకుపోయిన లోపాలు, నిర్లక్ష్య వైఖరిపై విద్యార్థి లోకం మండిపడుతోంది. పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడానికి అవసరమైన ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండటంతో పాటు.. తరగతి గదుల కొరత విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. కనీస మౌలిక సదుపాయాలు లేని వాతావరణంలో విద్యను కొనసాగించాల్సి రావడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిరసనకారులు వీధుల్లో నిర్వహించిన ర్యాలీలు, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో పలు నగరాలు అట్టుడికాయి. కొద్ది ప్రాంతాల్లో ఆందోళనలు అదుపు తప్పడంతో పోలీసులు బలాన్ని ప్రయోగించాల్సి వచ్చింది. ఈ క్రమంలో సుమారు ఐదు వేల మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఫ్రాన్స్ చరిత్రలోనే నిరసనల తీవ్రతను ప్రతిబింబిస్తోంది. విద్యా వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేసి.. మౌలిక సదుపాయాలను వెంటనే మెరుగుపరచకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి.
మరోవైపు స్పెయిన్‌లో గృహ నిర్మాణ, అద్దెల సంక్షోభం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నియంత్రణ లేని అద్దెల పెంపు సామాన్య, దిగువ మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది. ఆదాయంలో అధిక భాగం నివాస ఖర్చులకే వెచ్చించాల్సి రావడంతో జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోతున్నాయని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల అద్దెలపై తక్షణమే పరిమితులు విధించాలని.. అద్దెకు ఉంటున్న వారిని యజమానులు అన్యాయంగా ఖాళీ చేయించకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్పెయిన్‌లోని దాదాపు యాభైకి పైగా నగరాల్లో ఈ తరహా పోరాటాలు కొనసాగుతున్నాయి. వేలాది మంది ఆందోళనకారులు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు.విద్య, గృహ వసతి వంటి అత్యంత ప్రాథమిక హక్కుల నిరాకరణ పట్ల పౌరుల్లో వ్యక్తమవుతున్న ఈ అసంతృప్తి కేవలం
తాత్కాలికమైనది కాదని.. ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రాథమిక అవసరాలను తీర్చడంలో అధికార యంత్రాంగాలు విఫలమైనప్పుడు ప్రజలలో కలిగే తీవ్రమైన నిరాశే ఇటువంటి నిరసనలకు మూలకారణం. పరిస్థితి మరింత విషమించక ముందే ప్రభుత్వాలు స్పందించి.. నిరసనకారుల సమంజసమైన డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరించకపోతే.. ఈ ఉద్యమాలు మరింత తీవ్రరూపం దాల్చి దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితులను మరింత ప్రమాదంలో పడేసే అవకాశం ఉంది.

# వారసులకు నో టికెట్ ?



వారసులు అంటేనే అది ఒక అర్హతగా చాలా మంది ముందుకు వస్తున్నారు. దాంతో పార్టీలో ఏళ్ల తరబడి ఉన్న వారు, అవకాశాల కోసం వేచి చూస్తున్న వారు వెనకబడిపోతున్నారు. అదే సమయంలో పార్టీ కొందరికి మాత్రమే పరిమితం అవుతోంది అన్న చర్చకు కూడా ఆస్కారం ఉంటోంది. అందుకే వారసులకు టికెట్ విషయంలో టీడీపీ స్ట్రాంగ్ డెసిషన్ తీసుకుందని ప్రచారం సాగుతోంది. టీడీపీ మాత్రమే కాదు కూటమి పార్టీలకు కూడా ఇదే రూల్ వర్తించేలా ఉమ్మడి డెసిషన్ చేస్తున్నారు అని కూడా అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఇపుడు పెద్ద ఎత్తున పోటీ పడుతున్న వారసులకు ఈ నిర్ణయం అమలు అయితే మాత్రం నిరాశ తప్పదని అంటున్నారు.

**మేయర్ చుట్టూనే :**
విశాఖ మేయర్ చుట్టూ వారసులు పోటీ మామూలుగా లేదు, కేవలం ముగ్గురు నేతలు తప్పించి ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపుగా అంతా కూడా తమ వారి కోసం విపరీతంగా ప్రయత్నాలు చేస్తున్నారు అని అంటున్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, అలాగే జనసేనకు చెందిన పెందుర్తి అనకాపల్లి ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, కొణతాల రామకృష్ణ మాత్రమే ఈ వారసులని తీసుకుని రావడం లేదు. వారి నుంచి మాత్రమే ఎలాంటి సిఫార్సులు లేవని అంటున్నారు. వీరు తప్పించి మిగిలిన వారు అంతా తమ కుటుంబాలలో సతీమణినో అన్న దమ్ములనో కుమారుడు లేదా కుమార్తెలనో మేయర్ కుర్చీ కోసం పోటీకి పెట్టాలని తపిస్తున్నారు అని ప్రచారం సాగుతోంది.

**అడ్డుకట్ట పడినట్లే :**
కూటమి పార్టీలు కనుక ఉమ్మడిగా వారసులకు నో టికెట్ అన్న కీలక నిర్ణయం తీసుకుంటే మాత్రం వారికి అడ్డుకట్ట పడుతుందని అంటున్నారు. అంతే కాదు మేయర్ రేసులో ఉన్న వారిలో సగానికి సగం మంది పక్కకు తప్పుకున్నట్లు అవుతుందని అంటున్నారు. అసలు ఇలా ఎందుకు కూటమి పార్టీలు ఆలోచన చేస్తున్నాయంటే ఒకరి వారసులకు ఇస్తే మరో నేత తమ వారికి ఇవ్వలేదని అసంతృప్తి చెందే చాన్స్ ఉంటుంది. అది నాయకుల మధ్య పార్టీల మధ్య సమస్యగా మారుతుంది. అలాగే కార్యకర్తలు సైతం తీవ్ర అసంతృప్తి చెందుతారు. పార్టీ కోసం కష్టపడిన ద్వితీయ తృతీయ శ్రేణి నేతలు కూడా అసహనానికి లోను అవుతారు. అందుకే వీటికి చెక్ చెప్పేందుకే ఈ డెసిషన్ తీసుకుంటున్నారు అని అంటున్నారు.

**కొత్త వారికే :**
ఇక జీవీఎంసీలో మేయర్ తో పాటు 120 వార్డులలో అత్యధిక శాతం పార్టీలో యువతకు కొత్త తరానికి అవకాశం ఇవ్వాలని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. దాని వల్ల నాయకత్వం పెరగడమే కాకుండా జనంలోనూ సానుకూలత ఏర్పడుతుందని పార్టీల విజయానికి అది కారణం అవుతుందని కూడా అంచనా వేస్తున్నారు. అలా బహుముఖీయమైన ప్రయోజనాలను ఆశించి వారసులకు చెక్ చెప్పబోతున్నారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే కేవలం విశాఖ మేయర్ కే కాకుండా రాష్ట్రంలో వీలైనంత మేర వారసులను దూరంగా పెట్టాలని కూడా కూటమి పార్టీలు ఆలోచన చేస్తున్నాయని అంటున్నారు. దీని వల్ల స్థానిక సంస్థలలో యువతకు మహిళలకు అలాగే సమర్ధ నేతలకు మరిన్ని అవకాశాలు దక్కుతాయని అంటున్నారు. ఒక విధంగా ఇది మంచి నిర్ణయం అని అంతా స్వాగతిస్తున్నారు. ఒక నాయకుడి ఇంటికే పదవులు అన్నీ వెళ్లడం కంటే అధికారం వికేంద్రీకరణ జరగడం అర్హులకు అందలాలు దక్కడమే అసలైన ప్రజాస్వామ్యం అని అంటున్నారు.

# ఏపీ కూటమి సర్కారుకు అదే ‘అభయం’!



అన్ని కాంబినేషన్లు సూపర్ హిట్ కావు. సినిమాల సంగతి ఎలా ఉన్నా రాజకీయాలు అందుకు పూర్తి భిన్నం. రెండు రాజకీయ పార్టీలు కలిసి భాగస్వామ్యంతో ప్రభుత్వాన్ని నడపటం అంత తేలికైన విషయం కాదు. ఏపీలో అయితే ఏకంగా మూడు పార్టీలు. అది కూడా మిగిలిన మూడు భిన్నమైన పార్టీ. నిజానికి ఈ పార్టీల మధ్య పొత్తే ఒక విచిత్రం. ఎందుకంటే భావసారూప్యతల సంగతి పక్కన పెడితే.. ఈ మూడు పార్టీల అధినేతలు మినహాయించి.. నేతలు.. క్యాడర్.. చివరకు ఈ పార్టీల మద్దతుదారులు.. సానుభూతిపరుల మధ్య కూడా కలిసిమెలిసి ఉన్నట్లుగా కనిపించదు. మూడు పార్టీల అగ్రనేతలు మినహాయించి.. మిగిలిన వారి మధ్యన అభిప్రాయభేదాలకు కొదవ లేదు. ఈ కారణంగానే.. తమ మధ్య ఉన్న దూరాన్ని అధినేతలకు అపాదించే క్రమం కనిపిస్తూ ఉంటుంది.ఇక్కడే ఏపీ కూటమి పార్టీ మధ్య ఒక ఆసక్తికర మేజిక్ కనిపిస్తుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇప్పటివరకు ప్రతి మూడు నెలలకు ఒక ప్యాట్రన్ కొట్టొచ్చినట్లు కనిపిస్తూ ఉంటుంది. మీడియా.. సోషల్ మీడియా.. వాట్సప్ గ్రూపుల్లో కూటమి పార్టీలు ముఖ్యంగా తెలుగుదేశం –జనసేన మధ్య పొరపొచ్చాలు మొదలయ్యాయని.. టీడీపీ అధినాయకత్వం తీరు మీద జనసేనాని గుర్రుగా ఉన్నారని చెబుతూ.. దానికి రెండు మూడు అంశాల్ని సాక్ష్యంగా చూపిస్తూ చర్చలు మొదలు పెడతారు.అది అంతకంతకూ పెరుగుతూ ఉంటుంది. కొద్ది రోజులకు అదేమీ లేదన్నట్లుగా ఏదో ఒక కార్యక్రమంలోనూ.. మరే సందర్భంలోనో చంద్రబాబు, పవన్ మధ్య ఆత్మీయ అనుబంధం అలానే కొనసాగుతుందన్నది స్పష్టమవుతుంది. అంతేకాదు.. పవన్.. లోకేశ్ మధ్య కూడా వేలెత్తి చూపించేలా వ్యవహారశైలికి సంబంధించిన సాక్ష్యాలు ఉండకపోవటం.. జరుగుతున్న ప్రచారానికి భిన్నంగా వారిద్దరూ ఆత్మీయంగా కలిసి ఉండటం కనిపిస్తుంది. కూటమి సర్కారులో సూపర్ పవర్ గా పేర్కొనే లోకేశ్.. జనసేనానితో మాత్రం ఒదిగి ఉంటారు. నిజంగానే అన్న ఉంటే.. తమ్ముడు ఎలా బిహేవ్ చేస్తాడో.. అలానే పవన్ ముందు లోకేశ్ తీరు ఉంటుంది.ఇక్కడే మరో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. నిజానికి ఈ తీరే కూటమి సర్కారుకు శ్రీరామరక్షగా చెప్పాలి. చంద్రబాబు.. పవన్ కల్యాణ్ మధ్య బంధం కూడా ఎంతో మెచ్యూర్డ్ గా కనిపిస్తుంది. కొన్ని అంశాల విషయంలో చంద్రబాబు పాలన మీద పవన్ కు విభేదాలు ఉన్నా.. వాటిని బయటకు రానివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. అదేసమయంలో పవన్ కల్యాణ్ మనసుకు నొచ్చుకునేలా వ్యవహరించేందుకు చంద్రబాబు సుతారం ఇష్టపడని తత్త్వం కనిపిస్తుంది. అందుకే ఆచితూచి అన్నట్లుగా వ్యవహరిస్తారు.కూటమి సర్కారులో పవన్ కల్యాణ్ కు ప్రాధాన్యత తగ్గుతుందన్న మాట తరచూ వినిపించే క్రమాన్ని వెంటనే గుర్తించటం.. దానికి ఫుల్ స్టాప్ పెట్టేలా చంద్రబాబు చేతల్లో చూపించటం కనిపిస్తుంది. ఇక్కడే మరో అంశాన్ని ప్రస్తావించాలి. గతంలోనూ పలు పార్టీల భాగస్వామ్యంతో పని చేసిన సందర్భాలు ఉన్నాయి. అన్ని సందర్భాల్లోనూ తనకున్న బలాన్ని ప్రదర్శించేందుకు చంద్రబాబు వెనుకాడేవారుకాదు. కానీ.. కూటమి సర్కారులో అలా కాదు. తనకున్న బలం కంటే కూడా పవన్ తో ఉన్న బంధానికే అధిక ప్రాధాన్యత ఇవ్వటం కనిపిస్తుంది.పవన్ సైతం తనకున్న బలం.. తన పార్టీకి ఉన్న శక్తిసామర్థ్యాలు.. తన ప్రత్యర్థికి, తనకు ఉన్న తేడాను గుర్తించే విషయంలో ప్రాక్టికల్ గా ఉండటం కూడా కూటమి సర్కారు సాఫీగా సాగేందుకు సాయం చేస్తుందని చెప్పాలి. చేతి వేళ్లు ఒకేలా ఉండవన్న విషయాన్ని చంద్రబాబు.. పవన్ కల్యాణ్.. లోకేశ్ లు పూర్తిగా ఏకీభవించటమే కాదు.. అలా లేకపోవటం లోపం కాదు.. అదో సానుకూలాంశమన్న విషయాన్ని బలంగా నమ్ముతారు. వేళ్లన్నీ ఒకేలా ఉండకపోవటమే అసలుసిసలు బలమన్నట్లుగా.. కూటమిలోని భిన్నత్వమే వారిని ఏకం చేస్తుందన్న విషయాన్ని మర్చిపోకూడదు. కూటమి సర్కారులోని భాగస్వామ్య పక్షాలన్నికూడా తమ బలాలు.. బలహీనతలు మాత్రమే కాదు.. తామంతా కలవటానికి కారణమైన అంశాల్ని మర్చిపోకపోవటమే అసలుసిసలు మేజిక్ గా చెప్పాలి.

## బిజినెస్

# ఐఏఎఫ్ కాంట్రాక్టు లభిస్తే.. భారత్‌లో విమానాల తయారీ!



**వాషింగ్టన్/దిల్లీ:** భారత వాయుసేన (ఐఏఎఫ్) కోసం మధ్య తరహా రవాణా విమానాల సరఫరా కాంట్రాక్ట్ కనుక తమకు లభిస్తే, భారత్‌లో తమ ఉత్పత్తి సామర్థ్యాలను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా దిగ్గజ సంస్థ లాక్‌హీడ్ మార్టిన్ సీనియర్ అధికారి వెల్లడించారు. 60 మధ్య తరహా రవాణా విమానాలు కొనుగోలు చేసేందుకు 10.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.లక్ష కోట్ల) అంచనా వ్యయంతో, మనదేశం ఆగస్టులో టెండర్ జారీ చేసింది. ఈ కాంట్రాక్ట్ కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), మహీంద్రా గ్రూప్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), రిలయన్స్ డిఫెన్స్ సంస్థలు పోటీలో ఉన్నాయి. ఈ భారతీయ సంస్థలు అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని, ఈ ప్రాజెక్టు బిడ్డింగ్‌లో పాల్గొంటున్నాయి.

**హైదరాబాద్‌లో ఇప్పటికే**

లాక్‌హీడ్ మార్టిన్‌కు టీఏఎస్ఎల్‌తో దీర్ఘకాలంగా భాగస్వామ్యం ఉంది. హైదరాబాద్-వడోదరలో టాటాతో కలిసి సంయుక్తంగా నెలకొల్పిన టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్) ప్లాంట్లున్నాయి. సీ-130జే విమానాలకు వివిధ విడిభాగాలు, వెనుక భాగంలోని నిర్మాణాలను తయారు చేస్తున్నట్లు లాక్‌హీడ్ మార్టిన్ గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ - స్ట్రాటజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాన్ టెన్నీ తెలిపారు. కొత్త ఆర్డర్ లభిస్తే ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. విమానాల తయారీతో పాటు ఇతర కార్యకలాపాలు కూడా భారత్‌లోనే జరిగేలా చూస్తామన్నారు. లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 60 విమానాల్లో 12 విమానాలను పూర్తిగా సిద్ధం చేసిన స్థితిలో భారత్‌కు అందిస్తారు. మిగిలిన 48 విమానాలను భారత్‌లోనే తయారు చేస్తామని కంపెనీ ప్రతిపాదించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఇప్పటికే వినియోగిస్తున్న 12 సీ-130జే విమానాలను కూడా అధునాతన కాన్ఫిగరేషన్‌కు అప్‌గ్రేడ్ చేస్తామనీ లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలైతే, ఐఏఎఫ్ వద్ద ఒకే రకమైన అధునాతన కాన్ఫిగరేషన్ కలిగిన మొత్తం 72 విమానాలుంటాయి. ప్రస్తుతం ఐఏఎఫ్ వినియోగిస్తున్న సీ-130జే విమానాలు ఇప్పటివరకు 58,000కు పైగా విమాన ప్రయాణ గంటలను పూర్తి చేశాయి. లద్దాఖ్‌లోని అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ఇవి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. నేపాల్‌లో వరదల సమయంలో సహాయక చర్యలు, 2023లో సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తరలించే ఆపరేషన్ వంటి కీలక మిషన్లలో ఈ విమానాలను ఉపయోగించారు.

# ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ మధ్య తేడా ఏంటి?

**రిజిస్ట్రేషన్**

మీరు ఏదైనా స్థిరాస్తి కొన్నప్పుడు ప్రభుత్వం వద్ద నమోదు ద్వారా చట్టబద్ధంగా దాని యాజమాన్య హక్కుల్ని బదిలీ చేసుకోవడం అవసరం. కేవలం కొన్నదేగాక, మీకు వారసత్వంగా వచ్చినా, బహుమతి రూపం లో అందినా, వీలునామా ద్వారా సంక్రమించినా ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ప్రాపర్టీ యజమాని బదిలీ చేస్తే తప్ప.. మీరు సదరు ఆస్తికి యజమాని కాలేరుమరి. ఇక ఆస్తి విలువ రూ.100 దాటితే భారతీయ రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 17 కింద ఆ ఆస్తిని రిజిస్టర్ చేయించాల్సిందే. సేల్ డీడ్, వీలునామా, గిఫ్ట్ డీడ్ తదితర యాజమాన్య ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ ఇతర గుర్తింపు పత్రాలు ఇందుకు అవసరమవుతాయి. స్థిరాస్తి ఎక్కడ ఉన్నదో ఆ పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సాక్షుల సమక్షంలో కొన్నవారు, అమ్మినవారు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. అయితే పేర్కొన్న రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీలను చెల్లించాల్సి ఉంటుంది.

**మ్యూటేషన్**

ప్రభుత్వ భూ రెవిన్యూ రికార్డుల్లో ఆస్తి యజమాని పేరును మార్చడమే మ్యూటేషన్ ప్రక్రియ. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాకే మ్యూటేషన్‌కు వీలుంటుంది. సంబంధిత పత్రాలను సమర్పించి, మ్యూటేషన్ ఫీజు చెల్లిస్తే స్థానిక మున్సిపల్ కార్యాలయాల్లో పని జరుగుతుంది. ఆస్తి పన్ను, నీరు, విద్యుత్తు, గ్యాస్ కనెక్షన్ల కోసం కూడా ఇది తప్పనిసరి.




తర్వాత రోజుల్లో కొన్న ఆస్తిని తిరిగి అమ్ముకోవాలన్నా ఈ మ్యూటేషన్ ముఖ్యం. పైగా ఈ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌లు ఆస్తుల తగాదాలనూ నివారించగలవు.

# ఈఎంఐలు భారం కానున్నాయా? ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచే ఛాన్స్

**ముంబయి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలకమైన రెపోరేటును పెంచే అవకాశం ఉంది. అక్టోబర్ నెల ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును 0.25 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు, బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితుల కారణంగా నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలకు తోడు, ఇతర కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు సవరిస్తుండడమే ఇందుక్కారణమని పేర్కొంటున్నారు. ఒకవేళ విశ్లేషకులు ఊహించినట్లే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు సవరిస్తే.. రెపోరేటుతో ముడిపడి ఉన్న గృహ, వాహన రుణాలు ప్రియం కానున్నాయి. ఆ మేర నెలవారీ చెల్లించే ఈఎంఐలు భారం కానున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచింది. దీంతో అప్పట్లో రెపోరేటు 6.50 శాతానికి చేరింది. ఆపై 2023-24లో స్థిరంగా కొనసాగించింది. 2025లో వరుసగా వడ్డీ రేట్లు తగ్గించిన ఆర్‌బీఐ.. పశ్చిమాసియా పరిస్థితుల నేపథ్యంలో స్థిరంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ఎంపీసీ భేటీలో రెపోరేటుపై నిర్ణయం తీసుకోనుంది. బుధవారం నిర్ణయం వెలువడనుంది.

**పాత ప్రీమియం కార్లను కొనేద్దాం**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులతో సమానంగా ఆర్‌బీఐ కూడా వడ్డీ రేట్లు సవరించవచ్చని పలువురు ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వృద్ధి ఊపందుకోవడం వంటివి ఇందుకు కారణాలని చెబుతున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో మరోసారరి ఉద్రిక్తతలు తలెత్తడం వల్ల ఇంధనం, కమొడిటీ ధరలు పెరుగుతున్నాయని, దీనివల్ల మరోసారి రెపోరేటు పెంచొచ్చని అభిప్రాయపడుతున్నారు. పీటీఐ నిర్వహించిన పోల్‌లో మెజారిటీ ఆర్థిక నిపుణులు ఇదే తరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, మరోసారి స్టేటస్ కో కొనసాగించే




అవకాశమూ లేకపోలేదని మరో ఆర్థికవేత్త అభిప్రాయపడ్డారు. డిమాండ్ ఆధారిత ద్రవ్యోల్బణం ఇంకా ఊపందుకోని కారణంగా మరికొంతకాలం వేచి చూసే ధోరణిని ఆర్‌బీఐ అవలంబించొచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు.

# ఖతార్‌లో కలుద్దాం..

## అట్టహాసంగా ముగిసిన ఆసియా గేమ్స్

**నగోయా (జపాన్) :** రెండు వారాల పాటు వేలాది మంది ఆసియా క్రీడాకారుల హోరాహోరీ పోరాటాలకు వేదికగా నిలిచిన 20వ ఆసియా గేమ్స్‌కు తెరపడింది. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 90 నిమిషాల పాటు సాగిన ముగింపు వేడుకలు కనువిందు చేశాయి. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ జోఆన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఓసీఏ పతాకాన్ని 2030 ఎడిషన్‌కు ఆతిథ్యం ఇచ్చే ఖతార్‌లోని దోహా నగర ప్రతినిధులకు అధికారికంగా అందజేశారు. ఖతార్ హైజంప్ దిగ్గజం ముతాజ్ బార్షిమ్ నుంచి ఈక్వెస్ట్రియన్ రైడర్ జాసిమ్ అల్ కువారీ ఆసియాడ్ పతాకాన్ని స్వీకరించాడు.ముగింపు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన అథ్లెట్ల పరేడ్‌లో భారత ట్రాప్ షూటర్ నీరూ ధందా త్రివర్ణ పతాకాన్ని చేతిలో పట్టుకుని ముందు నడిచింది. తెలుపు, నీలం రంగు దుస్తులు ధరించిన సుమారు 30 మంది భారత అథ్లెట్లు, అధికారులు ఈ మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. 'వన్ ఆసియా' అనే ఇతివృత్తంతో రూపొందించిన వేదికపై జపాన్ సాంప్రదాయ 'బోన్-ఒడోరి' నృత్యాలు, 'మత్సుకెన్ సాంబా2' ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**ఆరంభ లోపాలను దాటి**

ఈసారి ఆసియా క్రీడల నిర్వహణలో జపాన్ భిన్నమైన వ్యూహాన్ని అనుసరించింది. భారీ ఖర్చులతో ప్రత్యేకంగా



అథ్లెట్స్ విలేజ్‌లు, కొత్త స్టేడియంలు నిర్మించకుండా.. అందుబాటులో ఉన్న వేదికలు, తాత్కాలిక నిర్మాణాలతో తక్కువ ఖర్చుతో క్రీడలను నిర్వహించింది. ఆరంభంలో హోటల్ వసతి సమస్యలు, రవాణా ఆలస్యం, అక్రిడిటేషన్ గందరగోళం ఎదురైనప్పటికీ.. నిర్వాహకులు త్వరగానే లోపాలను సరిదిద్ది పోటీలను విజయవంతంగా ముగించారు. 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు పాల్గొన్న పోటీల్లో 54 ప్రపంచ రికార్డులు, 89 ఆసియా రికార్డులు బ్రేక్ అవడంతో ఈ ఆసియాడ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.

## డివిలియర్స్ విధ్వంసం..

## విండీస్‌పై సౌతాఫ్రికా భారీ స్కోరు



వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) 2026 టోర్నీలో భాగంగా వెస్టిండీస్ చాంపియన్స్‌తో జరుగుతున్న టీ20 మ్యాచ్‌లో సౌతాఫ్రికా చాంపియన్స్ భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ ఏబీ డివిలియర్స్ (39 బంతుల్లో 70; 4 ఫోర్లు, 5 సిక్సర్లు), ఓపెనర్ రిచర్డ్ లెవీ (39 బంతుల్లో 87; 5 ఫోర్లు, 8 సిక్సర్లు) భారీ అర్ధశతకాలతో విధ్వంసం సృష్టించారు. వీరిద్దరి బీభత్సం ధాటికి సౌతాఫ్రికా చాంపియన్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. చివర్లో సారెల్ ఎర్వీ (23) ధాటిగా ఆడాడు. వెస్టిండీస్ చాంపియన్స్ బౌలర్లలో దేవ్ మొహమ్మద్ రెండు వికెట్లు తీయగా, ఫిడెల్ ఎడ్వర్డ్స్, రెయాడ్ ఎమ్రిట్, డ్వేన్ బ్రావో తలా ఒక వికెట్ తీశారు. ముందుగా రిచర్డ్ లెవీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఫోర్లు, సిక్సర్లతో మైదానం హోరెత్తించాడు. అగ్నికి వాయువు తోడైనట్లు లెవీకి డివిలియర్స్ జత కలవడంతో స్కోరుబోర్డు ఉరకలెత్తింది. ఈ ఇద్దరు రెండో వికెట్‌కు 42 బంతుల్లోనే 104 పరుగులు సాధించి సౌతాఫ్రికా భారీ స్కోరుకు బాటలు వేశారు. లెవీ ఔటైనప్పటికీ, సారెల్ ఎర్వీతో కలిసి డివిలియర్స్ జట్టు స్కోరును 200 దాటించాడు.

## స్పోర్ట్స్

# ముకేశ్ వికెట్ల వేట.. 30వసారి 'ఇరానీ' విజేతగా రెస్టాఫ్ ఇండియా..!




భారత వన్డే జట్టులో చోటు కోల్పోయిన రిషభ్ పంత్ దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటాడు. ఆటగాడిగా ధనాధన్ బ్యాటింగ్‌తో అలరించే పంత్ ఈసారి కెప్టెన్‌గా రెస్టాఫ్ ఇండియా(=వర్ ాట ×అఽఖు)కు టైటిల్ అందించాడు. ఇరానీ కప్ (×తీఖుఅఱ జబజా) ఫైనల్లో ముకేశ్ కుమార్(2-84, 33-6) ఎనిమిది వికెట్లతో విరచుకుపడగా.. పంత్ సారథ్యంలోని రెస్టాఫ్ ఇండియా 167 పరుగుల తేడాతో జమ్ము కశ్మీర్‌ను ఓడించింది. దాంతో రికార్డు స్థాయిలో ముప్పయ్యోసారి ట్రోఫీని ముద్దాడింది. ఇరానీ ట్రోఫీ 2026-27 ఫైనల్లో రెస్టాఫ్ ఇండియా అదరగొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సనత్ సాంగ్వన్(55) అర్ధ శతకంతో శుభారంభమివ్వగా.. స్మరణ్ రవిచంద్రరన్(135) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. అనంతరం 279 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ బ్యాటర్లను పేసర్ ముకేశ్ కుమార్ (2-84, 33-6) వణికించాడు. బుల్లెట్ బంతులతో నిప్పులు చెరిగిన ముకేశ్ ఏకంగా ఆరుగుని ఔట్ చేసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బతీశాడు. దాంతో.. జమ్ము 111 రన్స్‌కే కుప్పకూలింది. ఆల్‌రౌండ్ షోతో కనబరిచి 167 పరుగుల తేడాతో గెలుపొందిన రెస్టాఫ్ ఇండియా 30వ సారి ఈ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది. తద్వారా జట్టుకు ట్రోఫీ కట్టబెట్టిన రెండో వికెట్ కీపర్‌గా పంత్ గుర్తింపు సాధించాడు. ఖతర్నాక్ శతకంతో విజయంలో భాగమైన స్మరణ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.



# విశ్వక్‌సేన్ 'కల్ట్' విడుదల అప్పుడే

విశ్వక్‌సేన్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కల్ట్'. తారక్ సినిమా పతాకంపై సందీప్ కాకరాల భారీ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో నిర్మించిన భారీసెట్‌లో వందలాది మోడల్స్‌తో 40–50 రోజుల పాటు జరిగిన కీలక సన్నివేశాల చిత్రీకరణతో షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లో కూడా ఈ సినిమాను విడుదల చేస్తున్నామని, ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా 'కల్ట్' విడుదల కానున్నదని మేకర్స్ చెప్పారు. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, తారక్ పొన్నప్ప, ప్రజ్ఞ ఇతరపాత్రధారులు. ఈచిత్రానికి మాటలు: తరుణ్‌భాస్కర్, సౌండ్ డిజైన్: 'యానిమల్'ఫేం నచిన్.

# మట్టితో మమేకమైన కూలీ కథ

హీరో శర్వానంద్ నటిస్తున్న ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. సంపత్‌నంది దర్శకుడు. కేకే రాధామోహన్ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా ఈసినిమా టీజర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గ్రామీణ జానపద శైలిలో సాగే వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. బొగ్గుల గుట్ట అనే గ్రామాన్ని అక్కడి నాగరికతనూ, పగలు, ప్రతీకారాలు, భక్తి, మూఢ విశ్వాసాల నేపథ్యంలో టీజర్ సాగింది. శర్వా రఫ్ అండ్ రగ్డ్ లుక్‌లో మట్టితో మమేకమైన ఓ సాధారణ కూలీగా కనిపించారు. అనుపమ పరమేశ్వరన్ పాత్ర కూడా సీరియస్ మోడ్‌లో ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నది. 1960ల ప్రారంభంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథను దర్శకుడు సంపత్‌నంది ఎంతో సహజంగా, నేటివిటితో తెరకెక్కిస్తున్నట్టు టీజర్ చెబుతున్నది. రా, ఇంటెన్స్, రూటెడ్ ప్రపంచాన్ని టీజర్ ఆవిష్కరించింది. డింపుల్ హయాతీ మరో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిశోర్‌కుమార్ అరోకియా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.



# ఓ వైపు శాంతం మరోవైపు రౌద్రం

ప్రస్తుతం సాయిపల్లవికి మహర్దశ నడుస్తున్నది. ఒక కథానాయికగా దేశవ్యాప్తంగా తిరుగులేని గుర్తింపు రావడం అరుదైన విషయం. అన్ని భాషలకు చెందిన ప్రేక్షకులూ తమ హీరోయిన్‌గా ఓన్ చేసుకోవడం ఈ మధ్య సాయిపల్లవి విషయంలోనే జరిగిందని చెప్పక తప్పదు. వచ్చే నెలలో రెండు వారాల తేడాతో ఆమె సినిమాలు రాబోతున్నాయి. వాటిలో మొదటిది నితీష్ తివారీ 'రామాయణ: పార్ట్ 1'. ఈ పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యంలో సాయిపల్లవి సీతామహాసాధ్విగా కనిపించనున్నారు. సరిగ్గా ఈ సినిమా విడుదలైన రెండు వారాలకు, అంటే.. నవంబర్ 20న ధనుష్ హీరోగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఓం: చాప్టర్ 1' విడుదల కానున్నది. ఇందులో సాయిపల్లవిది కీలకమైన పాత్ర. యాక్షన్, ఎమోషన్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని సమాచారం. రెండు వారాల గ్యాప్‌తో రెండు పొంతన లేని పాత్రల ద్వారా ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని సాయిపల్లవి పంచనున్నదని సినీవర్గాలు అంటున్నాయి. ఈ ప్రయత్నాలు రెండూ ఫలిస్తే.. సాయిపల్లవి క్రేజ్ దేశవ్యాప్తంగా మరింత పెరగడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.






# 'చకోర' ఓ అమ్మ చెప్పిన కథ

శ్రవణ్, మలైకా టి వాసుపల్ జంటగా నటించిన చిత్రం 'చకోర -- లూనార్ లవ్ బర్డ్'. మంగా శ్రీనివాస్ దర్శకుడు. చింతాడ హేమారావు నిర్మాత. అక్టోబర్ 9న సినిమా థియేట్రికల్ రిలీజ్ కానున్నది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ వైజాగ్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'ఇదొక అమ్మ చెప్పిన ప్రేమకథ. కేవలం వర్షపునీళ్లతోనే దాహం తీర్చుకునే విశిష్టమైన పక్షి చకోర. ఆ పక్షిలాగే మనం కూడా స్వచ్ఛమైన పేమ కోసమే వేచి చూడాలని, అలాగే.. చకోర పక్షికి జాబిల్లిని చేరాలని కోరిక. దాని కోసం అలుపెరగకుండా ప్రయాణిస్తుంది. ఆ ప్రయత్నంలోనే మరణిస్తుంది. మనం కూడా చకోర పక్షిలా లక్ష్యాన్ని చేరుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమించాలని ఈ సినిమా ద్వారా చెబుతున్నాం' అని దర్శకుడు మంగా శ్రీనివాస్ అన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు శ్రవణ్, మలైకా ఆనందం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందం అంతా మాట్లాడారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com